645) పాడి

ప॥ శిష్టరక్షణమును దుష్టవిగ్రహమును । సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాడు ॥

చ॥ హరి కృష్ణావతార మందినయంతలోనే । పరమమునులకెల్ల భయముడిగెను ।
తెరచి దైత్యులగుండె దిగులుచొచ్చె నత్తరి । సిరులమించినయట్టి శ్రీజయంతినాడు ॥

చ॥ గోవిందుడు వసుదేవకొడుకైనయప్పుడే । గోవులు రంకెలుసేసి గొల్లపల్లెను ।
నోవితోడ గంసునికి నూరునిండె జూడగానె । చేవలుమీరినయట్టి శ్రీజయంతినాడు ॥

చ॥ నారాయణుడు భువి నరుడు దా గాగానే । మేర బాండవు లెచ్చిరి మేనవావిని ।
కౌరవులపని దీరె కమ్మి శ్రీవేంకటేశుడు । చేరువనే మెరయగ శ్రీజయంతినాడు ॥